క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ కంబ గిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రుద్రవరం ఎస్‌ఐగా బాధ్యతలు



మహ్మద్ రఫీ

రుద్రవరం: మండల ఎస్‌ఐగా మహ్మద్ రఫీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన వరప్రసాద్‌ను ఉన్నతాధికారులు ఆళ్లగడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నంద్యాల నుంచి రఫీ ఇక్కడికి వచ్చారు.

పూడికతీత పనుల పరిశీలన



దొర్నిపాడులోని 24లాక్ వద్ద పనులను పరిశీలిస్తున్న డీఈ

దొర్నిపాడు: కేసీ కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను ఆశాఖ డీఈ రవీంద్ర శనివారం పరిశీలించారు. ప్రస్తుతం 21లాక్ నుంచి 27 వరకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాల్వలో పూడిక, ముళ్లపొదలు తొలగిస్తున్నట్లు చెప్పారు. దీంతో కేసీలో సాగునీరు చివరి ఆయకట్టు రైతులకు వెళ్లేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం



హరివరంలో గొర్రెలకు మందు తాపుతున్న పశు వైద్యాధికారి

ఉయ్యాలవాడ: నట్టల నివారణతో జీవాల్లో రోగ నిరోధక శక్తి పెరిగి సురక్షితంగా ఉంటాయని పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని హరివరం గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 800 గొర్రెలు, మేకలకు మందు తాపించారు. జూలై 10వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందు తాపించడం జరుగుతుందన్నారు. పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుద్రవరం రేంజి అధికారి బదిలీ



రేంజర్‌కు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

రుద్రవరం: అటవీశాఖ రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. శనివారం ఆయన రిలీవ్ అవుతున్న సందర్భంగా రేంజి పరిధిలోని సిబ్బంది రుద్రవరం అటవీ కార్యాలయంలో ఆయనకు శాలువా, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో కొత్తగా రేంజర్‌ను నియమించకపోవడంతో రుద్రవరం రేంజిలో డిప్యూటీ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న ముర్తుజావలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన రేంజర్‌తో పాటు ఇన్‌చార్జి రేంజర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన కుర్చీలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందిస్తామని డిపో మేనేజర్ గంగాధర్ రావు తెలిపారు. శనివారం నూతన ట్రిపుల్ సీటర్ చైర్లు, కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నవి కాకుండా అదనంగా 20 కుర్చీలు, 20 ఫ్యాన్లు ఏర్పాటు చేశామని చెప్పారు.


శిథిలావస్థలో పశువైద్యశాల

● మందు బాబులకు అడ్డాగా ఆస్పత్రి





కోటపాడు పశువైద్యశాల దుస్థితి



దెబ్బతిన్న పైకప్పు



ప్రాంగణంలో పడేసిన మందు సీసాలు, వాటర్ ప్యాకెట్లు

శిరివెళ్ల: కోటపాడు పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో సిబ్బంది, రైతులు ఆందోళన చెందుతున్నారు. కోటపాడు, వీరారెడ్డిపల్లె రైతుల కోసం 1981లో పశువైద్యశాలను నిర్మించారు. ఈ రెండు గ్రామాల్లో 956 గేదెలు, 150 మేకలు, 956 గొర్రెలున్నాయి. ప్రతిరోజూ పశువులకు వైద్యం కోసం రైతులు ఈ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. అయితే, భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతినడంతో ఇనుప కడ్డీలు బయటపడుతున్నాయి. పెచ్చులు ఊడి కిందపడుతున్న ఘటనలు పదేపదే జరుగుతున్నాయి. డాక్టర్ గది, వరండాలో ఎక్కడ చూసినా పైకప్పులో ఇనుప కడ్డీలు దర్శనం ఇస్తున్నాయి. వైద్యశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో భవనం చుట్టూ పొలాల నుంచి విషపురుగులు భవనంలోకి వస్తున్నాయి.

రాత్రివేళల్లో మందుబాబుల రాజ్యం

పశువైద్యశాల మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇక్కడే తిష్ట వేసి మద్యం తాగుతున్నారు. మద్యం సీసాలు, వాటర్‌బాటిళ్లు, చెత్తను పడేస్తున్నారు. పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. ఉదయం డాక్టర్ రాగానే వరండాలో మందు సీసాలు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. వాటిని శుభ్రం చేసుకోవడం పరిపాటిగా మారింది. ఇటీవల పోలీసులు దాడులు చేశారు. కొంత కాలం వరకు మందు బాబులు రాలేదు. తిరిగి మళ్లీ అక్కడే తిష్టవేశారు. నూతన వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పనిభారం తగ్గించాలని వినతి



రుద్రవరం: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు



ఉయ్యాలవాడలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఉయ్యాలవాడ: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని నిరసిస్తూ సామూహిక సెలవు కోరుతూ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు సామూహిక సెలవు మంజూరు చేయాలని కోరారు. తమ సమస్యలకు పరిష్కారం లభించకపోతే పంచాయతీ కార్యదర్శులంతా దీర్ఘకాలిక సెలవులో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జయరామిరెడ్డి, కార్యదర్శులు రాజశేఖర్‌బాబు, సతీష్‌కుమార్, విజయదీప్తి, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

● **రుద్రవరం:** విధి నిర్వహణలో పనిభారం తగ్గించి ఆదుకోవాలని లేకుంటే సామూహిక సెలవులపై వెళ్తామని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఈ మేరకు తమ సమస్యలపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

కార్యదర్శుల మూకుమ్మడి సెలవు

దొర్నిపాడు: సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు మండలానికి చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, ఓబులేసు, మధు, బ్రహ్మానందరెడ్డి శనివారం సామూహిక సెలవు పెట్టారు. రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆదేశాల మేరకు ఎంపీడీఓ సావిత్రికి వినతి పత్రం అందజేశారు. సెలవు మంజూరు చేయాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలి

గోస్పాడు: నీటి సమస్య తీవ్రత ఉందని అధికారుల పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, రాయలసీమ సాగునీటి సాధన సమితి మండల నాయకుడు బెక్కెం రామసుబ్బారెడి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉదయం వెళ్లిన పశువులు ఇంటికొచ్చే వరకు నీరు లభించడం లేదన్నారు. శ్రీశైల జలాశయంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయని ఇలాంటి పరిస్థితుల్లో కూడా నీరివ్వకపోవడం దారుణమన్నారు. గతంలో ఇలాంటి అవస్థలు లేవన్నారు.

సీఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా సీఆర్పీలకు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ గురప్ప, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గెలివి స్కూల్‌లో శనివారం ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన చెస్ పోటీల్లో శ్రీసాయి చెస్ అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థులు అండర్–17 పోటీల్లో రెండు ద్వితీయ బహుమతులు సాధించడంతో కోచ్ పల్లంశెట్టి సురేష్ అభినందించారు. బహుమతులు శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, కోచ్‌లు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామానికి చెందిన మహిళ శంషాద్‌పై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన శంషాద్ అనే మహిళ రహదారి వెంట బర్రెలు తోలుకెళ్తుండగా.. ఆటో రఫీ, వలితో పాటు మరో ఇద్దరు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసినట్లు మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. గాయపడిన శంషాద్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అప్పు చెల్లించలేదని మహిళపై దాడి

నంద్యాల(అర్బన్): అప్పు చెల్లించే విషయంలో మండలం అయ్యలూరు మెట్టకు చెందిన అనురాధపై ఎల్లా మహేష్, మరో నలుగురు దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. అనురాధ, భర్త బ్రహ్మంనాయుడు, ఎల్లా మహేష్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే విషయంలో ఇరువురు ఘర్షణ పడ్డారన్నారు. అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

లాల్‌స్వామి కమిటీ ఎన్నిక

చాగలమర్రి: మండల కేంద్రంలోని చిన్నమకానం వీధిలో వెలసిన హజ్రత్ లాల్‌స్వామి కమిటీ అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం మకానంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ముల్లా ఇబ్రహీం, మిగిలిన కమిటీని యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తీర్మానించారు. సమావేశంలో కమిటీ ట్రెజరర్ ముల్లా రఫీ, కమిటీ మాజీ అధ్యక్షుడు ముల్లా జిలాని, సభ్యులు ముల్లా షఫీ, ముల్లా దాదాపీర్, షంషీర్, షేక్షా మోదీన్, చాంద్‌బాషా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దత్తుని అనుగ్రహం సర్వాభీష్టదాయకం



హయగ్రీవాచార్యులు

నంద్యాల(వ్యవసాయం): శ్రీ దత్తుని అనుగ్రహం సర్వభీష్ట దాయకమని టీటీడీ, శ్రీశైల దేవస్థానల వ్యాఖ్యాత డాక్టర్ డీవీ హయగ్రీవ చార్యులు పేర్కొన్నారు. శనివారం మెయిన్ బజారులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ గురు వైభవం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ గురు వైభవంలో శ్రీపాద వల్లభుడు జన్మ వృత్తాంతం, వారి తల్లిదండ్రులకు అనుగ్రహం కలిగించిన విధానం,సన్యాస స్వీకారం, గోకర్ణ క్షేత్రం, మహాబలేశ్వర లింగం వైభవం గురించి భక్తులకు వివరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాసి వాసు, మహేష్, రామశేషు, ఇందుమతి, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

శిరివెళ్ల: డిగ్రీ కళాశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. శనివారం కళాశాల పనుల పురోగతి, 2025–26 విద్యా సంవత్సరం అడ్మిషన్లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. కళాశాలలో మౌలిక వసతుల కోసం కాలేజీ ఫండ్ రూ. 45 లక్షలను వెచ్చిస్తున్నామని తెలిపారు. గదులకు రంగులు, లీకేజీ ఉన్న గదులకు మరమ్మతులు, ప్రహరీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జేకే నాలెడ్జి సెంటర్, బాలికలకు కుట్టు మిషన్ శిక్షణ జరుగుతుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. గతేడాది కళాశాలకు ఎన్‌సీసీ మంజూరైందని తెలిపారు. క్రీడల్లో తమ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వైఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి

● మరొకరికి గాయాలు



లారీ టైర్ల కింద పడిన కుమార్ నాయక్

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన కుమార్ నాయక్ (24) తన సోదరి కుమారైతో కలిసి ద్విచక్రవాహనంపై నెరవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జలదుర్గం వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతివేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో కుమార్ నాయక్ లారీ టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరి కుమారైకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహానందిలో వీకెండ్ సందడి

చిన్నకోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: కొద్దిరోజులుగా భక్తులు లేక వెలవెలబోయిన ఆలయ ప్రాంగణాలు శనివారం వీకెండ్ సందర్భంగా కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కోనేరులా స్నానాలాచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఆలయ తలుపులు మూసే వరకు, తిరిగి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

గ్రామసభల నిర్వహణతోనే ప్రజాస్వామ్యం బలోపేతం



జిల్లా పంచాయతీ కార్యాలయ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గ్రామ సభలు సక్రమంగా నిర్వహించడం ద్వారానే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న కుమారి తెలిపారు. జిల్లాలో జూలైలో గ్రామ సభలు సక్రమంగా నిర్వహించేలా మండల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా పంచాయతీ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామ అభ్యుదయమే దేశాభివృద్ధికి మూలమని, గాంధీ కలలు కన్న స్వరాజ్యం రావాలంటే గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రహంతుల్లా, శివశంకర్, నీలిమ పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు



పట్టణ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): భారత రాజకీయాల్లో అపర చాణిక్యుడుగా కీర్తినార్జించిన మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతిని శనివారం స్థానిక నంది రైతు సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. సమాఖ్య గౌరవ సలహాదారులు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి హాజరై పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీయేనని కొనియాడారు. నంద్యాలలో వ్యవసాయ కళాశాల, బ్రాడ్ గేజ్ రైల్వే, ఉపరితల వంతెన ఏర్పాటు పీవీ హయాంలో జరిగాయని గుర్తు చేశారు. డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ నంద్యాలకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ సృష్టించిన 'నరసింహ' అనే పత్తి వంగడాన్ని పీవీ చేతుల మీదుగా ఆవిష్కరించారన్నారు. డాక్టర్ కిశోర్ కుమార్, డీవీ సుబ్బయ్య, విశ్రాంత ప్రొఫెసర్ కైలాసనాథరెడ్డి, అధ్యాపకులు రఫీ, వెంకటేశ్వర్లు బాలచంద్రుడు,శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో...

నంద్యాల బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకృష్ణ విద్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభాకర్ శర్మ, సీతారామ శర్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, ప్రసాద్, అబ్రహాం, మహమ్మద్ హుసేన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గోస్పాడు: పని ఒత్తిడి తగ్గించాలంటూ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం జిల్లా కేంద్రమైన నంద్యాల పీజీఆర్ఎస్ హాల్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రోజూ ఉదయం 6 గంటలకే గ్రామాల్లో విధులకు హాజరు కావాలంటూ ఒత్తిడి చేస్తుందన్నారు. 2024లో సీపీఆర్‌గా వచ్చినప్పటి నుంచి ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గర్వించేలా పంచాయతీ కార్యదర్శులు పని చేశారన్నారు. రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులకు సొంత మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వకపోగా ఉదయాన్నే ఐవీఆర్‌ఎఫ్, పంచాయతీ శానిటేషన్ పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అటెండ్ కావాలని, ఆ రోజు దినపత్రికతో ఫొటోలు దిగి ఉన్నతాధికారులకు పంపాలని చెబుతున్నారన్నారు. సర్వేల పేరుతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం రోజురోజుకు పెరిగిపోతుందని వాపోయారు. చిన్న పిల్లల తల్లిదండ్రులతో పాటు అనారోగ్యంతో బాధపడే ఎంతో మంది సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే ఆయా గ్రామాలకు వెళ్లాలంటే వీలు కాని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీల్లో నిధుల కొరత ఉందని, క్లాప్ మిత్రలకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితితో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే పలు రకాల సర్వే పేరుతో తీరిక లేకుండా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ప్రభుత్వానికి, అధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా ఒత్తిడి కలిగించేలా పనులు అప్పగిస్తుండటం సమంజమన్నారు. అనంతరం డీఎల్‌పీఓ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యదర్శులు ప్రసాద్, పార్థసారథిరెడ్డి, వెంకటరమణయ్య, నాగేశేషులు పాల్గొన్నారు.

శనగ సాగుకు ముందు పొలాన్ని ఖాళీగా ఉంచరాదు



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

నంద్యాల(అర్బన్): శనగ పంట సాగు చేసే ముందు రైతులు పొలాన్ని ఖాళీగా ఉంచరాదని, పొలాల్లో కొర్ర, సోయాచిక్కుడు, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేయాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం శిక్షణ సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో 70వేల ఎకరాలకు పైగా శనగ సాగు అవుతుందన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించిందని, తక్షణ చర్యలు తీసుకోకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పొద్దుతిరుగుడు పంట సాగుపై శాస్త్రవేత్తలు, వ్యవయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. శాస్త్రవేత్తలు నరసింహరావు, డీడీఏ మద్దిలేటి, ఏడీఏ ఆంజనేయ, రాజశేఖర్ పాల్గొన్నారు.

కట్టెల కోసం వెళ్లి తప్పిపోయిన వృద్ధురాలు

● పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది రంగప్రవేశంతో సురక్షితంగా ఇంటికి..



వృద్ధురాలితో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలానికి చెందిన వృద్ధురాలు అడవిలో తప్పిపోయింది. పోలీసులు, అటవీశాఖ సిబ్బంది స్పందించి ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీశైలం కొత్తపేటకు చెందిన తెలుగు అమ్మమ్మ తన అల్లుడు, మనవడితో కలిసి మల్లమ్మ కన్నీరు వైపు అడవిలోకి శుక్రవారం సాయంత్రం కట్టెల కోసం వెళ్లింది. తెలుగు అమ్మమ్మ దారి తప్పిపోయి అడవిలో కనబడ లేదని వారి బంధువులు శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ జి.ప్రసాదరావు, సిబ్బంది, శ్రీశైలం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఠాగూర్, ప్రొటక్షన్ వాచర్లు వృద్ధురాలి బంధువులతోకలిసి రాత్రి గాలింపు చేపట్టారు. శనివారం ఉదయం 10 గంటలకు మిద్దెల గుడి వద్ద ఆమె ఆచూకీ కనుకొని సురక్షితంగా తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



రైతు కష్టం పశువుల పాలు...!

అరటి తోటలో మేస్తున్న పశువులు

మహానంది మండలంలో ఇటీవల ఈదురు గాలులకు 1,100 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరగడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి కష్టించి పండించిన పంట దిగుబడులు చేతికి వస్తాయనుకునే లోపు నేలకొరగడంతో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తిమ్మాపురం – జమాలయ్యదర్గా మార్గంలో ఓ అరటి పొలంలో నేలకూలిన చెట్లు పశువులకు మేతగా మారాయి. – మహానంది